క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నేడు నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర పోటీలు

నందికొట్కూరు: ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర పోటీలను రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమా వేశంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సంబరాలు



టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 11 డిమాండ్లతో 42 రోజులు పాటు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులతో 10 డిమాండ్లకు పరిష్కారం లభించడంతో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ దీక్షలను విరమించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద బాణా సంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు సకాలంలో పాల్గొనేలా చూడాలి

జూపాడుబంగ్లా: ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో మండలం నుంచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు బుధవారం నుంచి నందికొట్కూరు పట్టణంలో ప్రారంభమయ్యే ఆడుదాం-ఆంధ్ర క్రీడాపోటీల్లో సకాలంలో పాల్గొనేలా పీఈటీలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో భాగంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ మండలస్థాయి క్రీడల్లో ప్రతిభను చూపిన క్రీడాకారులను తాలూకా స్థాయికి ఎంపికచేసినట్లు తెలిపారు.

31న మండల సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఈనెల 31న పాములపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ మంగళవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరవ్వాలన్నారు. అలాగే మండలస్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

పట్టణంలో 40 శాతం కులగణన పూర్తి

నందికొట్కూరు: పట్టణంలో కులగణన 40 శాతం వరకు పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన కార్యక్రమం వేగవంతం చేస్తునట్లు పేర్కొన్నారు. కులగణన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

సమ్మెబాటలో వైకేపీ సిబ్బంది

జూపాడుబంగ్లా: వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం, సీసీలు సమ్మెబాట పట్టడంతో మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వెల వెల బోయింది. ఈ విషయమై ఏపీఎం అంబమ్మకు ఫోన్‌చేయగా తమ సమస్యల పరిష్కారార్థమై ప్రభుత్వానికి ఇదివరకే సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించనందున తాము విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లినట్లు వెల్లడించారు.

ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే

- మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం
- అందరినీ కలుపుకొని ముందుకు పోవాలి
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందని రాష్ట్ర శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు పసుపు కుంకుమ ఇస్తానని మోసం చేసిన ఘనుడు చంద్రబాబేనన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నవరత్నాల పేరుతో అర్హులైన పేద వారందరికీ లంచం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగనన్న చరిత్రలో నిలిచారని చెప్పారు. సచివాలయాలు, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామంలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఫ్యామిలీ డాక్టర్స్ ఇంటికే వెళ్లి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా ప్రభుత్వం మందులు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా వైఎస్సార్ సంచార వాహనాల ద్వారా పశువుల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను చట్టసభలకు పంపాలన్నదే జగనన్న ఉద్దేశమని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు సైనికులా పని చేయాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు లోకేష్‌రెడ్డి, రవియాదవ్, పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు శివరామకృష్ణారెడ్డి, తులసిరెడ్డి, శివనాగిరెడ్డి, సర్పంచులు నాగస్వామిరెడ్డి, జీవరత్నం, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

నందికొట్కూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనపై ఆకర్షితులై మండలంలోని జంగంపాడు గ్రామంలోని 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ చేరాయి. మంగళవారం శాతనకోట గ్రామ సర్పంచ్ జనార్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ సిద్ధార్థరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, రవి, గంగన్న, మద్దిలేటి, వెంకట్‌నాయక్, మండ్ల రాజు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నాఫెడ్ ద్వారా కందుల కొనుగోలు

జూపాడుబంగ్లా: నాఫెడ్ ద్వారా నందికొట్కూరు మార్కెట్‌యార్డు అధికారులు రైతుల నుంచి ఏ రోజు ధర ప్రకారం ఆ రోజు కందులు కొనుగోలు చేయనున్నట్లు మార్కెట్ యార్డు మేనేజర్ మున్న, తంగడంచ వీహెచ్‌ఏ వెంకటేశ్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజూ బహిరంగ మార్కెట్లో ఏ రేటు ఉంటే ఆ ధర ప్రకారంగా రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తారన్నారు. కందులు సాగుచేసిన రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్సులతో నందికొట్కూరు మార్కెట్‌యార్డులో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న రైతుల ధాన్యాన్ని వారి ఇళ్లవద్దకే వచ్చి కాటావేయనున్నట్లు తెలిపారు. హమాలీ ఖర్చులు రైతులే భరాయించుకోవాల్సి ఉంటుందని, ట్రాన్స్‌పోర్టు ఖర్చు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్:9440440983 సంప్రదించాలన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

పాములపాడు: పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ఇందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలే నిదర్శనమని సర్పంచు నాయిని సావిత్రమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని జూటూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్టు డాక్టర్లు వచ్చిన దాఖలాలు గతంలో ఎన్నడూ లేవన్నారు. అయితే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్టు డాక్టర్లచే గ్రామాల్లో వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు.ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసనాయక్, డాక్టర్లు నాగలక్ష్మీదేవి, డీఎండీ విలాయత్, జాకీ అహజాన్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందుతుందని సర్పంచ్ నాగస్వామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, కంటి వైద్యులు పాల్గొన్నారు.



జూటూరులో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సర్పంచు, ఎంపీడీఓ

ప్రజారోగ్యమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

మహానంది: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి పేద వాడికి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని బండిఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ భావన, ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. బండి ఆత్మకూరు మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.జగదీష్ చంద్రారెడ్డి, డా.కాంతారావు నాయక్, డా.రోహిత్, డా.అనిత పాల్గొన్నారు.

నియోజక వర్గ స్థాయికి 5 జట్ల ఎంపిక

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు మండలం నుంచి 5 జట్లు ఎంపిక అయ్యాయని ఎంపీడీఓ మేరి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ క్రీడలలో మొత్తం 46 జట్లు మండల కేంద్రంలో జరిగిన క్రీడాపోటీలలో పాల్గొన్నాయి. ఇందులో 5 జట్లు నియోజకవర్గ స్థాయికి ఎంపిక అయ్యాయని తెలిపారు. కబడ్డీ ఎదురుపాడు, ఖోఖో ముసలిమడుగు, వాలీబాల్ దుద్యాల, క్రికెట్ కొత్తపల్లి, బ్యాడ్మింటన్ దుద్యాల గ్రామాల జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి

గ్రామాలలో జరుగుతున్న కులగణన సర్వేను సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం శివపురం, కొత్తపల్లి, నందికుంట గ్రామాలలో సర్వే తనిఖీ చేశారు.



సీసీరోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

సీసీ రోడ్ల ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రం సున్నిపెంట గ్రామంలో మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సీసీ రోడ్లను ప్రారంభించారు. బండ్ల బజార్ , కాకుల సెంటర్, వెస్టన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు రూ 60 లక్షలతో చేపట్టిన రోడ్లను ప్రారంభించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. వెస్టన్‌కాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు శిల్పా చక్రపాణిరెడ్డికి గజమాల వేసి సత్కరించారు. నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు గుండయ్య యాదవ్, కార్యకర్తలు ఆటో మల్లి, దమయంతి, బక్కన్న, అనీల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో రూ.3.98 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించనున్నారు. క్షేత్రంలో పలు చోట్ల పూర్తి చేసిన సీసీ రోడ్లు, కొత్తపేటలో ఫేస్-1 , ఫేస్-2 లలో మొత్తం 12 చోట్ల నిర్మించి సీసీ రోడ్లు, ముదిరాజ్ సత్రం నుంచి మల్లికార్జున అన్నదానం జంక్షన్ల వరకు వేసిన సీసీ రోడ్లు, రైల్వే గెస్ట్ హౌస్, చంద్రావతి కల్యాణమండపం వద్ద నిర్మించిన ఆర్‌సీసీ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, నందికేశన్ సదన్ వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, గంగా-గౌరీసదన్ భవనాల జనరేటర్ రూమ్, 380 కేవీ డీజిల్ జనరేటర్లను ప్రారంభిస్తారు.

ఘనంగా నేతాజీ జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివశంకర్ మాట్లాడుతూ గాంధీజీ వంటి వారు అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధించాలనే దిశగా అడుగులు వేస్తే.. సుభాష్‌చంద్రబోస్ మాత్రం ఆజాద్‌హింద్ ఫౌజ్ ను స్థాపించి తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, అధ్యాపకులు విజయప్రసాద్, ,ప్రకాష్, బాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ పోరాటాలను వివరిస్తున్న అధ్యాపకుడు శివశంకర్

725 గ్రూపులకు రూ.156.09 లక్షలు మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లోని 725 పొదుపు సంఘాల్లోని మహిళలకు వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరైనట్లు వైఎస్సార్ క్రాంతి పథం అకౌంటెంటు రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 944 పొదుపు సంఘాలుండగా అందులో 725 సంఘాలకు రూ.156.09లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులు పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేసినట్లు వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు: పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఏపీకౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, రాజశేఖర్, , ఏసురత్నం పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామానికి చెందిన చాకలి మహేష్ (33) ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుని భార్య వెంకటలక్ష్మికి మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి చేతుల మీదుగా రూ. 10 వేలు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ, అంజి పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సెక్యురిటీ గార్డ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి పై బండిఆత్మకూరు మండలంలో నారాయణపురం గ్రామానికి చెందిన కొందరు దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బ్రాహ్మణకొట్కూరు సబ్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున

బొమ్మలసత్రం: నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సబ్ ఇన్ స్పెక్టర్ నాగార్జున జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని ముచ్చుమర్రి సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీని కలిశారు.

27న సర్వసభ్య సమావేశం

మహానంది: ఈ నెల 27 న మహానంది మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి మంగళవారం తెలిపారు. మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశశ్విని అధ్యక్షతన బుక్కాపురంలోని పొదుపు మండల సమాఖ్య భవనంలో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు హాజరుకావాలన్నారు. అధికారులు ప్రగతి నివేదికలను ముందురోజే సమర్పించాలని కోరారు.

నేడు ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా డ్రైవర్స్ డే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి డ్రైవర్ విధినిర్వహణలో రాత్రిపగలు తేడా లేకుండా ప్రయాణికులను, బడిపిల్లలను, ఉద్యోగులను వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నారన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు డ్రైవర్లు , ప్రయాణికులు హాజరుకావాలని కోరారు.

గడ్డి వాముల దగ్ధం

మిడుతూరు: స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని కళ్లంలో ఓ రైతు ఏర్పాటు చేసుకున్న గడ్డివామి సోమ వారం రాత్రి దాదాపు 12 గంటల సమయంలో దగ్ధ మైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మధు అనే వ్యక్తి తన కళ్లంలో గడ్డివామిని ఏర్పాటు చేసుకున్నాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తు లు నిప్పుపెట్టడం వల్ల గడ్డి వాములు దగ్ధమయ్యా యని బాధితుడు మధు వాపోతున్నాడు. ఇదిలావుండగా ఆదివారం రాత్రి కూడా గ్రామానికి చెందిన నాగలింగం, నాగభూషణం, కార్తీక్‌కు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఎస్సీ కాలనీలో వరుసగా జరుగుతున్న సంఘటనలు బట్టీ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వాములను తగులబెడుతున్నారని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. బాధితులు విషయాన్ని ఎస్‌ఐ జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఎస్‌ఐ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో నాటుసారా బట్టీలపై మంగళవారం దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊట, 15లీటర్ల నాటుసారాను పారబోసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

మహానంది: గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మ తోపు గ్రామంలో నాటుసారా విక్రయ దారులపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో సారావిక్రేత శివకుమార్ పరారైనట్లు చెప్పారు.

నందికొట్కూరు: నాటు సారా విక్రయిస్తున్న నీలి షికారి సలుందీని అరెస్టు చేసినట్లు మంగళవారం టౌన్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. షికారి పేటలో నాటు సారా అమ్ముతుండగా ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసు లు దాడులు నిర్వహించి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రిపోర్టులు సకాలంలో పంపాలి

నంద్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహించే రోజూవారీ పరీక్షల రిపోర్టులను సకాలంలో జిల్లా అధికారులకు పంపాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. మంగళవారం స్థానిక సమావేశ మందిరంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా మేనేజర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సమన్వయంతో హైపటైటిస్ బీ,సీ, హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి వారికి కేటాయించిన లక్ష్యాలు పూర్తిచేయడమే కాకుండా, పరీక్షల రిపోర్టులు త్వరితగతిన అందించి సంబంధింత వివరాలను జిల్లా స్థాయి అధికారులకు అందేలా చూడాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి శారదాబాయ్ మాట్లాడుతూ ఏపీ సాక్స్ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. టీబీ పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఏఓ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, అకౌంటెంట్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మహానంది: క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశశ్విని, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర మండల స్థాయిలో గెలుపొందిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో జట్ల క్రీడాకారులకు మంగళవారం స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ

పథకాలను సద్వినియోగం చేసుకోండి



టీ షర్ట్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రామకృష్ణ, బీజేపీ మైనార్టీ మహిళా మోర్చా జాతీయ సభ్యురాలు మొమిన్ షబానా అన్నారు. పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్‌భారత్ టి-షర్ట్‌లను , క్యాలెండర్లను పంపిణీ చేశారు. అంతకుమునుపు ప్రజలతో ప్రతిజ్ఞ నిర్వహించి కేంద్రప్రభుత్వం అందించే పథకాలను వీడియో ద్వారా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసంతపంచమి వేడుకలను విజయవంతం చేద్దాం

కొత్తపల్లి: మండలంలోని అధికారుల సమన్వయంతో కొలనుభారతిదేవి ఆలయంలో నిర్వహించే వసంతపంచమి వేడుకలను విజయవంతం చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. మంగళవారం కొలనుభారతి క్షేత్రంలో ఈఓ మోహన్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చేనెల 14న కొలనుభారతి క్షేత్రంలో వసంతపంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు, సందర్శకులు వేల సంఖ్యలో వస్తారన్నారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సేవలందించాలని సూచించారు. అదేవిధంగా భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆర్టీసీ నుంచి భక్తుల సౌకర్యార్థం 4 బస్సులను ఏర్పాటు చేస్తామని, నీటి సమస్యలేకుండా పైపులైన్ల మరమ్మతులు, రోడ్డు వెంట దుమ్ము,ధూళి రాకుండా నీటిని చల్లడం, పారిశుధ్యం, శానిటేషన్, వైద్యులచే మెడికల్ క్యాంపులు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఆర్‌ఐ జహంగీర్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి భీముడు నాయక్, గోకవరం పీహెచ్‌సీ వైద్యుడు విజయేంద్ర, అటవీశాఖాధికారి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

చాగలమర్రి: జిల్లాలో రైతులందరూ సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, శెట్టివీడు, పెద్దబోధనం, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ఈ నెలాఖరు లోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఏఓ రంగ నేతాజీ, సచివాలయ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ఆత్మకూరు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామా రూఫ్, డీఎస్పీ శ్రీనివాసయాదర్, సీఐ నాగభూషణం యాదవ్, డాక్టర్ రాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రిపబ్లిక్ డే సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానం అత్యంత కీలకమని అన్ని దానాల కంటే రక్తదానం మిన్న అన్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారికి ఊపిరిపోసి ప్రాణాలు నిలబెడుతుందని చెప్పారు. ప్రతి వ్యక్తి ఏడాదికి మూడు సార్లుకు పైగా రక్తదానం చేయవచ్చని తెలిపారు. శిబిరంలో వెలుగోడు ఎస్‌ఐ వెంకటప్రసాద్ యాదవ్, పాములపాడు ఎస్‌ఐ అశోక్‌కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది, పాత్రికేయులు, పట్టణ ప్రజలు దాదాపు 70 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

నంద్యాల(న్యూటౌన్): ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారి శ్రీకాంత్, డీఎస్పీ మహేశ్వరరెడ్డి నేషనల్ హైవే అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లాలోని నేషనల్ హైవే-40రోడ్డుపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హైవేపై అయ్యలూరు మెట్ట నుంచి సుగాలి మెట్ట వరకు, చాబోలు క్రాస్ రోడ్డు వరకు వెంకటేశ్వర పురం, శాంతిరామ్ మెడికల్ కాలేజ్, పిన్నాపురం రహదారులను అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్, నేషనల్ హైవే అధికారులు సుధాకర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు